గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు
- కంభపూర్‌లో పంచాయతీ భవనం ప్రారంభం



కంభపూర్‌లో ఎమ్మెల్యేను సన్మానించి జ్ఞాపిక అందజేస్తున్న సర్పంచ్ కవితాపాటిల్

పిట్లం(జుక్కల్): త్వరలో జరిగే పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పని చేయాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్ పేర్కొన్నారు. ఆయన బుధవారం కంభపూర్‌లో నాయకులతో కలిసి కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అదే విధంగా కంభపూర్‌లో రూ.20 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం పాలకవర్గ సభ్యులు, అధికారులతో సమావేశమై గ్రామ అభివృద్ధి గురించి పలు అంశాలపై చర్చించారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో గాయపడిన గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో కలెక్టర్ జితేశ్ వి పాటిల్, జెడ్పీటీసీ అరికెల శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ కవిత పాటిల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అడ్వొకేట్ రాంరెడ్డి, జంబిగె హన్మాండ్లు, మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుదాం



పుల్కల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

బిచ్కుంద(జుక్కల్): అన్ని విధాలుగా వెనకబడి ఉన్న జుక్కల్ నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుదామని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. బుధవారం పుల్కల్‌లో సొసైటీ చైర్మన్ ఎన్నిక అనంతరం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి హాజరయ్యారు. చైర్మన్ భీంరెడ్డి, డైరెక్టర్లకు ఎమ్మెల్యే సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా ప్రభుత్వ ఆరు గ్యారంటీ పథకాలు ప్రతి గడపకు చేరాలన్నారు. అందరికి అందే విధంగా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలు, ఇతర పనులు ఉంటే ప్రజలు నేరుగా తనకు కలిసి విన్నవించుకోవాలన్నారు. వెంటనే సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మల్లికార్జునప్ప శెట్కార్, వెంకట్‌రెడ్డి, నాగ్‌నాథ్, చైర్మన్ భీంరెడ్డి, వినోద్, ప్రదీప్, పాషా, తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల అవగాహన సదస్సు



విజయ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ చిట్టెం లక్ష్మికి జ్ఞాపికను అందజేస్తున్న సిబ్బంది

కామారెడ్డి రూరల్: పాడిని అభివృద్ధి చేయాలని విజయ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ చిట్టెం లక్ష్మి అన్నారు. బుధవారం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని పాతరాజంపేట శివారు విజయ డెయిరీ పాల కేంద్రంలో పాడి రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాడి రైతుల కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకువస్తుందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని గ్రామాల్లో విజయ డెయిరీ సంస్థను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత రైతులపై ఉందన్నారు. రైతులకు దాణా, విత్తనం, పెళ్లి కానుకలు ఇస్తున్నామన్నారు. దీంతోపాటు లీటర్ పాలకు రూ.4 అదనంగా ఇస్తున్నామన్నారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని రైతులు గ్రామాల్లో పాల ఉత్పత్తిని పెంచాలని సూచించారు. కామారెడ్డి విజయ డెయిరీని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని పార్లర్‌లు స్థాపించడం విజయ డెయిరీ గొప్పతనమని పేర్కొన్నారు. విజయ డెయిరీ ఎస్ఈ దేవేందర్, జనరల్ మేనేజర్ మల్లయ్య, డిప్యూటీ డైరెక్టర్ నందకుమారి, డిప్యూటీ మేనేజర్ వైష్ణవి, కామారెడ్డి డివిజన్ అధ్యక్షుడు చింతకుంట తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రమదానం

లింగంపేట(ఎల్లారెడ్డి): బీజేపీ లింగంపేట మండల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు బుధవారం ఆలయాల్లో శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా లింగంపేటలోని రామాలయం, ముత్యాల పోచమ్మ, దత్తాత్రేయ ఆలయాల్లో పిచ్చి మొక్కలు చెత్తా చెదారం తొలగించి శుభ్రం చేశారు. ఈ నెల 22న అయోధ్యలో శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ ఉండడంతో ఆలయాల ఆవరణలను శుభ్రం చేస్తున్నట్లు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు దత్తురాం, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మహారాజుల మురళి, ప్రధాన కార్యదర్శి రాంచందర్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లారం సాయన్న, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం పోలీసులు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వారితో జాగ్రత్తగా ఉండాలన్నారు. గ్రామాల్లో తెలియని వారు సంచరించినా.. అనుమానంగా కనిపించినా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. పిల్లలు ఫోన్ వినియోగించినప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. పోలీసు సిబ్బంది బుజ్జి, ముబీన్, గీత తదితరులు పాల్గొన్నారు.

పట్టణ స్వర్ణకారుల సంఘం నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

బాన్సువాడ: బాన్సువాడ పట్టణ స్వర్ణకారుల సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం బాన్సువాడలో ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా సత్యనారాయణచారి, ఉపాధ్యక్షుడిగా సర్జన మధుచారి, ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్‌చారి, సహాయ కార్యదర్శిగా గజానంద్‌చారి, కోశాధికారిగా బాబుచారిలను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా వెంకటేశం చారి, నర్సింహచారి, రామాచారిలను నియమించారు. స్వర్ణకారుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని అధ్యక్షుడు సత్యనారాయణచారి అన్నారు.

ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాల సంఘం..

కామారెడ్డి టౌన్: ఉమ్మడి జిల్లా ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యం సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా మధుసూదన్ జోషి, ప్రధాన కార్యదర్శిగా హన్మంతరావు, కోశాధికారిగా సంగం సంతోష్, ఉపాధ్యక్షుడిగా మైసయ్య ఠాకూర్, సంయుక్త కార్యదర్శిగా అరుణ్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా సూర్యప్రకాశ్, బాలాజీ రావు, సంఘ గౌరవ అధ్యక్షుడిగా సీహెచ్. రజినీ కాంత్, ముఖ్య సలహాదారులుగా ముజీబ్ అలీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వరదారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌరు తిరుపతి రెడ్డి, టుప్మా అధ్యక్షుడు హరిప్రసాద్ పాల్గొన్నారు.



ప్రైవేట్ జూనియర్ కళాశాలల ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు

రోడ్డు భద్రతపై అవగాహన ఉండాలి



బీబీపేట: రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరు తప్పక అవగాహన కలిగి ఉండాలని ఆర్టీఏ వెహికల్ ఇన్‌స్పెక్టర్ విద్యాధర్ రెడ్డి అన్నారు. 35వ రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని జీపీ కార్యాలయం వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడు భద్రత విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు తప్పకుండా ధరించాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శి రమేష్, కారోబార్ సిద్ధరాములు తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

గురుకుల పరీక్ష దరఖాస్తు గడువు పొడిగింపు

భిక్కనూరు/పెద్దకొడప్‌గల్: రాష్ట్రంలోని అన్ని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఐదవ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేయటానికి గడువును ఈనెల 20 వరకు పొడిగించినట్లు భిక్కనూరు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి, పెద్దకొడప్‌గల్ గురుకుల పాఠశాల, కళాశాల హెచ్‌ఎం నళిని బుధవారం తెలిపారు. నాలుగవ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వారు కోరారు.

గతంలో పట్టుబడిన ఆటోకు రేపు వేలంపాట

కామారెడి క్రైం: గతంలో ఓ కేసులో పట్టుబడిన ఆటోకు కామారెడ్డి ఎక్సైజ్ కార్యాలయంలో రేపు వేలంపాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ విజయ్ కుమార్ బుధవారం తెలిపారు. ఆ వాహనానికి ప్రభుత్వ ప్రాథమిక ధర రూ.42 వేలుగా నిర్ణయించామన్నారు. 18 శాతం జీఎస్టీ అదనంగా ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు ముందుగా రూ.5 వేలు డిపాజిట్‌గా చెల్లించి వేలం పాటలో పాల్గొనడానికి నమోదు చేసుకోవాలని సూచించారు.

22న విశేష పూజలు, మహా అన్నదానం

కామారెడ్డి అర్బన్: అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల సందర్భంగా ఈనెల 22న కామారెడ్డి విశ్వనాథేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు, మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. భక్తులు హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేసింది.

ఆర్యసమాజ్‌లో 3 రోజుల పాటు ప్రవచనాలు

కామారెడ్డి అర్బన్: శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల సందర్భంగా ఈ నెల 20, 21, 22 తేదీల్లో ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు కామారెడ్డి ఆర్యసమాజంలో శ్రీరామకథ ప్రవచనం నిర్వహించనున్నట్లు ఆర్యసమాజ్ ప్రతినిధి ఆచార్య సత్యమిత్ర తెలిపారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



పెద్దకొడప్‌గల్(జుక్కల్): కాటేపల్లిలో సంక్రాంతి సెలవుల సందర్భంగా యువకులు నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. గెలుపొందిన వారికి నిర్వాహకులు బుధవారం బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి పెద్దకొడప్‌గల్ క్రికెట్ టీం సాధించగా, రెండో బహుమతి కాటేపల్లి టీం గెలుచుకుంది.

రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి



ఎల్లారెడ్డి : రానున్న లోక్‌సభ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటేలా చూడాలని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. బుధవారం ఎల్లారెడ్డిలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య అనుచరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రానున్న లోక్‌సభ ఎన్నికలలో పార్టీ సత్తా చాటి జహీరాబాద్ స్థానం గెలిచేందుకు ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయాలని అన్నారు. నాయకులు జలంధర్ రెడ్డి, ఎల్లారెడ్డి సొసైటీ చైర్మన్ నర్సింలు, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట జెడ్పీటీసీ ఉషాగౌడ్, మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌ను బుధవారం మండల బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జాజాల మాట్లాడుతూ..గెలుపోటములు సహజమని, నిత్యం ప్రజల్లో ఉంటూ సేవలు అందించాలని కార్యకర్తలకు, నాయకులకు సూచించారు.

బీసీ సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి: జాతీయ బీసీ సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను బుధవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చింతల శంకర్, ప్రధాన కార్యదర్శి బొమ్మెర రాజయ్య, మహిళా అధ్యక్షురాలు మంజుల, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి చింతల పోశవ్వ, ప్రతినిధులు పాల్గొన్నారు.

జీపీల అభివృద్ధికి ప్రణాళికలు

డీపీవో శ్రీనివాస్‌రావు



గర్గుల్ జీపీలో మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్

కామారెడ్డి రూరల్: గ్రామాలభివృద్ధితోనే ప్రజల జీవన విధానంలో మార్పులు వస్తాయని డీపీవో శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. బుధవారం ఆయన గర్గుల్ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్(జీపీడీపీ) ప్రణాళిక పనులపై సంబంధిత శాఖాధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. గ్రామానికి సంబంధించిన ప్రాధాన్యత సమస్యలను గ్రామ సభ నిర్వహించి యాక్షన్ ప్లాన్ ఆమోదించి ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. ఈ సందర్భంగా డీపీవో శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. దేశానికి గ్రామాలే పట్టు కొమ్మలన్నారు. జనవరి 27లోపు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల డెవలప్మెంట్ ప్లాన్లు తయారు చేసుకోవాలని సూచించారు. అనంతరం వాటిని ఈ–గ్రామ్ స్వరాజ్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఎంపీవో మలహరి, గ్రామ కార్యదర్శి శోభ తదితరులున్నారు.

జీపీ కార్యదర్శుల సమస్యలపై పోరాటం

- టీపీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహేశ్ గౌడ్



సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పంచాయతీ కార్యదర్శుల సమస్యలపై తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్(టీపీఎస్ఎఫ్) నిరంతరం పోరాటం చేస్తుందని టీపీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులతో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ప్రమోట్ చేయడంలో టీపీఎస్ఎఫ్ ఎనలేని కృషి చేసిందన్నారు. కార్యదర్శులు నరేందర్, నర్సింలు, అజీమోద్దీన్, కృష్ణమూర్తి, కృష్ణవేణి, సునంద, రమ్యశ్రీ, ప్రదీప్, నరేష్, సుభాష్‌రెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

బాల కార్మికుల నిర్మూలన కోసమే 'సాధన'



గ్రామసభ నిర్వహిస్తున్న సంస్థ ప్రతినిధులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామాలలో బాలకార్మికుల నిర్మూలన కోసమే సాధన సంస్థ కృషి చేస్తుందని సంస్థ జిల్లా ప్రతినిధి శ్రీనివాస్ పేర్కొన్నారు. బొల్లారంలో బుధవారం సాధన సంస్థ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బొల్లారంను బాల కార్మికుల నిర్మూలనతోపాటు బాల్యవివాహాల నిర్మూలన గ్రామంగా మార్చామన్నారు. దీంతో పాటు గ్రామాన్ని బాలల అక్రమ రవాణా రహితంగా మార్చామని చెప్పారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరిస్తూ వారికి అవగాహన కల్పించేందుకు తమ సంస్థ కృషి చేస్తుందన్నారు. సర్పంచ్ వీణ, ఉప సర్పంచ్ ధర్మవీర్, పంచాయతీ కార్యదర్శి సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకోవాలి



మద్నూర్‌లో మాట్లాడుతున్న బ్యాంకు అధికారి

మద్నూర్(జుక్కల్): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నోడల్ అధికారి విక్రమ్ పాటిల్ సూచించారు. మండల కేంద్రంలోని గాంధీచౌక్‌లో బుధవారం కేంద్ర ప్రభుత్వ పథకాలు నేరుగా ప్రజలకు అందించేందుకు వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేశ్, కార్యదర్శి సందీప్, ఉప సర్పంచ్ విఠల్, మెడికల్, బ్యాంకింగ్, పోస్టల్, వ్యవసాయశాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వర్మి కంపోస్టుతో ఎరువును తయారు చేసుకోవాలి



మాట్లాడుతున్న విండో చైర్మన్ సదాశివరెడ్డి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): వర్మి కంపోస్టుతో ఎరువును తయారు చేసుకోవాలని విండో చైర్మన్ సదాశివరెడ్డి సూచించారు. బుధవారం అడ్లూర్‌ఎల్లారెడ్డిలో సింగిల్ విండో కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కూరగాయలు పండించే రైతులకు కేవలం 20 పైసలకు ఒక మొక్క చొప్పున గరిష్టంగా 15 వందల మొక్కలను పంపిణీ చేయడానికి రిలయన్స్ ఫౌండేషన్ ముందుకు వచ్చినట్లు పేర్కొన్నారు. వర్మి కంపోస్టు ఎరువు తయారీ విధానంపై బీబీపేటకు చెందిన సిద్ధిరాములు అవగాహన కల్పించారు. పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు నర్సారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ ఆకుల సిద్ధిరాములు, వార్డు మెంబర్ రాజయ్య, రైతులు గంగారెడ్డి, పద్మారెడ్డి ఉన్నారు.

జర్మినేషన్‌పై దృష్టి సారించండి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): హరితహారం నర్సరీలలో జర్మినేషన్‌పై దృష్టి సారించాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో రఘు సూచించారు. అచ్చాయపల్లి, మెల్లకుంటతండా గ్రామ పంచాయతీల పరిధుల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను బుధవారం ఆయన పరిశీలించారు. నర్సరీలలో ఏర్పాటు చేసిన బ్యాగులలో మొలకలు వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. దీంతోపాటు క్రమం తప్పకుండా నీటిని పోయించాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు రమ్యశ్రీ,, సవాయిసింగ్ ఉన్నారు.

అక్షింతల పంపిణీ



ఎల్లారెడ్డిరూరల్ (ఎల్లారెడ్డి): భిక్కనూరు గ్రామంలో బుధవారం గ్రామస్తులు అయోధ్య శ్రీరాముడి పూజిత అక్షింతలను ఇంటింటికి తిరుగుతూ పంపిణీ చేశారు. ఎల్లారెడ్డి పట్టణంలోని రామాలయం నుంచి అక్షింతలను గ్రామస్తులు బైక్ ర్యాలీగా తీసుకొచ్చారు. అనంతరం గ్రామంలోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, ఇంటింటికి తిరుగుతూ పూజిత అక్షింతలను పంపిణీ చేశారు. సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ గోనె శ్రీకాంత్, శ్రీరాముడి భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సౌండ్ సిస్టమ్ వితరణ



సదాశివనగర్(ఎల్లారెడ్డి): కల్వరాల్ గ్రామంలో గ్రామ సంఘానికి బుధవారం ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు సహకారంతో సౌండ్ బాక్స్ సిస్టమ్‌ను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శివరాం, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. మంగళవారం నాటికి లక్షా 93 వేల 321 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సొసైటీ చైర్మన్‌గా భీంరెడ్డి



బిచ్కుంద(జుక్కల్): పుల్కల్ సొసైటీ చైర్మన్ ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. చైర్మన్‌గా భీంరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంవత్సరం క్రితం ఇందిర ప్రహ్లాద్ చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. వైస్ చైర్మన్‌గా ఉన్న రాంరెడ్డి ఇన్‌చార్జి చైర్మన్‌గా కొనసాగుతున్నారు. ఎన్నికల అధికారిగా రమేష్ నామినేషన్లు స్వీకరించారు. భీంరెడ్డి ఒక్కరే నామినేషన్ వేయడంతో అధికారులు ఏకగ్రీవంగా భీంరెడ్డిని ప్రకటించి ఎన్నిక సర్టిఫికెట్ అందించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. రైతుల అభివృద్ధి కోసం రుణాలివ్వడానికి సిద్ధంగా ఉన్నామని, సంఘం సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అధికారులు మురళి గౌడ్, అబ్దుల్ అలీం, కార్యదర్శి సాయి ప్రకాష్, సంఘం డైరెక్టర్లు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై జాగ్రత్త వహించాలి



రాజంపేట: నర్సరీలలో మొక్కల పెంపకంపై జాగ్రత్త వహించాలని ఎంపీడీవో బాలకిషన్ అన్నారు. బుధవారం రాజంపేట మండలం పెద్దాయిపల్లి నర్సరీని ఆయన సందర్శించారు. మొక్కలకు ప్రతిరోజు నీరు అందించి మొక్కల ఎదుగుదలకు కృషి చేయాలని సంబంధిత కార్యదర్శి సోనీని ఆదేశించారు. నర్సరీలలో తొందరగా పెరిగే జామ, బొప్పాయి, మునగ, ఉసిరి, గులాబి,అల్ల నేరేడు వంటి మొక్కలు పెంచేలా చూడాలని సూచించారు.ఆయన వెంట ఎంపీవో రఘురాం,టీఏ రాజులు ఉన్నారు.

వంద శాతం పన్నుల వసూలే లక్ష్యం



బీబీపేట: గ్రామంలో వంద శాతం పన్నులు వసూలు చేయడమే లక్ష్యమని మాందాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి నవీన్ అన్నారు. బుధవారం గ్రామంలో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పన్నులు వసూలు చేశారు. గ్రామంలోని ప్రతి ఇంటింటికి తిరిగి ఇంటి, నీటి పన్నులను తీసుకున్నారు.

కార్యదర్శులతో సమావేశం



గాంధారి(ఎల్లారెడ్డి): గ్రామ పంచాయతీ పరిధుల్లో వంద శాతం ఇంటిపన్ను వసూలు చేయాలని ఎంపీడీవో సతీష్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం ఆయన స్త్రీ శక్తి భవనంలో పంచాయితీ కార్యదర్శులతో సమీక్షించారు. సోషల్ ఆడిట్, జీపీ డీపీ, ఎస్‌బీఎం, నర్సరీల నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. ఎంపీవో రాజ్‌కిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ పేరు పెట్టాలి

మాచారెడ్డి: తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ పేరును జనగామ జిల్లాకు పెట్టాలని మన రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎడపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం జనగామ జిల్లాకు ఐలమ్మ పేరు పెట్టకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని ఒక ప్రకటనలో హెచ్చరించారు.